క్లుప్తంగా

3న మండల సర్వసభ్య సమావేశం

సంగెం: మండల పరిషత్‌ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ కళావతి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కాసర్ల రవీందర్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3న ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 11గంటలకు సమావేశం ఉంటుందన్నారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు సమగ్రమైన ప్రగతి నివేదికలతో, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

చీరలు, పంచలు పంపిణీ



చెన్నారావుపేట: మండలంలోని సూరుపల్లిలో మహాలక్ష్మీ గణపతి సేవా ట్రస్ట్‌ ఆధ్వర్యంలో ఎస్‌వీ నాగేశ్వర్‌రావు, రామారావు, శ్రీనివాస్‌, రాంబాబు, పల్లె పోతుల లక్ష్మీనర్సయ్యలు ఎస్సై శ్రీనివాస్‌ చేతుల మీదుగా 58 మంది దంపతులకు ఆదివారం చీరలు, పంచలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఒక్కరు సేవా గుణాన్ని కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో మహబూబాబాద్‌ కౌన్సిలర్‌ చిట్యాల జనార్దన్‌రావు, సర్పంచ్‌ సింగారపు గీత భాస్కర్‌, ఉప సర్పంచ్‌ చుక్క అయిలయ్యలు ఉన్నారు.

సమాచారం ఇవ్వాలి

చెన్నారావుపేట: స్థానిక పోలీస్‌ స్టేషన్‌లో పోలీసుల పనితీరుపై సమాచారం ఇవ్వాలని సమాచార హక్కు చట్టం జిల్లా అధ్యక్షుడు కాటా కుమారస్వామి ఆధ్వర్యంలో ఆదివారం ఎస్సై శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. స్టేషన్‌లో కేసుల వివరాలు, ఆదాయ, వ్యయాలతోపాటు పలు రకాల పూర్తి వివరాలు అందించాలన్నారు. కార్యక్రమంలో వీరేందర్‌రెడ్డి, జాటోతు యాకూబ్‌, కూస సుదర్శన్‌ ఉన్నారు.

ప్రహరీ కూల్చిన వారిపై దర్యాప్తు

నెక్కొండ: నిరుపయోగంగా ఉన్న ఎస్సీ హాస్టల్‌ ప్రహరీని అక్రమంగా కూల్చివేత ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షేక్‌ జానీపాషా ఆదివారం తెలిపారు. చల్లా గోదాం సమీపంలో ఉన్న హాస్టల్‌ శిథిలావస్థకు చేరడం, విద్యార్థులెవరూ లేకపోవడంతో మూసి ఉందన్నారు. దీంతో డిసెంబర్‌ 28న గుర్తుతెలియని వ్యక్తులు ప్రహరీని కూల్చి వేసిన విషయమై హాస్టల్‌ ఇన్‌చార్జ్‌ వార్డెన్‌ పాలకుర్తి మధు ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు. 5 ఫీట్ల వెడల్పు, 80 ఫీట్ల పొడవు ఉన్న ప్రహరీని జేసీబీ సాయంతో కూల్చివేశారని ఫిర్యాదులు వచ్చాయన్నారు. దీంతో సుమారు రూ.లక్ష మేర నష్టం వాటిందని ఎస్సై చెప్పారు. జేసీబీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

‘బాలాజీ టెక్నో’లో నూతన సంవత్సర వేడుకలు



నర్సంపేట రూరల్‌ : మండలంలోని లక్నెపల్లి గ్రామ శివారులోని బాలాజీ టెక్నో స్కూల్‌లో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను బిట్స్‌ చైర్మన్‌ డాక్టర్‌ ఎ.రాజేంద్రప్రసాద్‌రెడ్డి హాజరై కేక్‌ కట్‌ చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ పెరుమాండ్ల రాజేంద్రప్రసాద్‌, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దరఖాస్తుల కొరత

పర్వతగిరి: మండలంలోని కొన్ని గ్రామాల్లో అభయహస్తం దరఖాస్తులు లభించకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇంటి నంబర్ల ఆధారంగా దరఖాస్తులను లబ్ధిదారులకు అందజేస్తున్నప్పటికీ ఒక ఇంటిలో రెండు మూడు కుటుంబాలు ఉన్న కారణంగా దరఖాస్తులు ఒకే ఇంటినంబర్‌తో ఒకే దరఖాస్తు ఇవ్వడంతో మిగిలిన కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతున్నారు. దరఖాస్తుల కొరత ఉందని ఎంపీడీఓ చక్రాల సంతోష్‌కుమార్‌ దృష్టికి తీసుకెళ్లగా ప్రింటింగ్‌ సమస్య ఉందని, రెండు రోజుల్లో అందజేస్తామని చెప్పారు.

దాడి చేసిన వ్యక్తులపై కేసు

నల్లబెల్లి: నకిలీ నోట్ల చెలామణి వ్యవహారంపై ఓ పత్రికలో వార్తా కథనం ప్రచురితం కాగా బాధితులు ఆ పత్రిక ఎడిటర్‌పై దాడికి పాల్పడినట్లు ఎస్సై నైనాల నగేష్‌ ఆదివారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నకిలీ నోట్ల వ్యవహారంలో ఓ పత్రికలో వార్తా కథనాలు ప్రచురితం కాగా ములుగు జిల్లా గోవిందారావుపేట మండలం పస్రాకు చెందిన ఎండీ సమీనా, ఎండీ మహ్మద్‌, ఎస్‌కే జిలానీ, ఎస్‌కే హెబ్బీర్‌లతో పాటు మరికొందరు వ్యక్తులు పత్రిక ఎడిటర్‌పై బొల్లోనిపల్లిలో శనివారం దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

‘బెల్టు’ తీసేదెన్నడో!

- గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టుషాపులు
- మండలంలో సుమారు 260 దుకాణాలు
- మూసివేస్తామని కాంగ్రెస్‌ మేనిఫెస్టోలో హామీ

సంగెం: గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా బెల్టుషాపులు నడుస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు, ఎక్సైజ్‌ అధికారులు బెల్టుషాపులు నిర్వహించే వారిని పోటాపోటీగా బైండోవర్లు చేయడంతో పూర్తిగా గ్రామాల్లో బెల్టుషాపులు మూతపడ్డాయి. దీంతో పల్లెల్లో మద్యం ప్రవాహం తగ్గింది. ఎలాంటి గొడవలు లేకుండా ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని పలువురు చెబుతున్నారు. ఎన్నికలు పూర్తి కావడ, కొత్త వైన్‌షాపులు రావడంతో మళ్లీ గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు. దీంతో పగలు, రాత్రి తేడా లేకుండా మద్యం విక్రయాలు కొనసాగి మళ్లీ ప్రశాంతత కరువైందని మహిళలు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 33 గ్రామపంచాయతీలుండగా కాపులకనిపర్తిలో ఒకటి, సంగెంలో రెండు మొత్తం మూడు వైన్‌షాపులు మంజూరయ్యాయి. వీటికి అనుబంధంగా మద్యం ప్రియుల కోసం బార్లను తలపించేలా పర్మిట్‌ రూంలను కూడా ఏర్పాటు చేసింది. వైన్‌షాపులు ఉన్నచోటనే మద్యం సేవించాలి. దీంతో చుట్టుపక్కల ఉన్న గ్రామాల వారికి మద్యం అందుబాటులో లేకపోవడం వల్ల వైన్‌షాపులు లేని మిగిలిన 31



వైన్‌ నుంచి బెల్టుషాపునకు మద్యం తీసుకెళ్తున్న బెల్టుషాపు నిర్వాహకుడు

గ్రామాల పరిధిలోని ప్రజలు అక్కడికి వెళ్లలేక మద్యం తాగకుండానే గడిపేవారు. గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహించరాదనే నిబంధనలున్నప్పటికీ నిబంధనలు అతిక్రమించి గల్లీగల్లీ బెల్టుషాపు తిరిగి నడుస్తున్నవి. చిన్న గ్రామాల్లో నాలుగు నుంచి ఐదు పెద్ద గ్రామాల్లో 15 వరకు బెల్టుషాపులున్నవంటే అతిశయోక్తి కాదు. ప్రతి కిరాణాషాపు మద్యం షాపుగా మారడంతో ఆయా వాడల్లోని చుట్టు ప్రక్కల ఇళ్లలోని మహిళలు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధిక ధరలకు మద్యం విక్రయాలు

గ్రామాల్లో బెల్టుషాపుల్లో యజమానులు ఎమ్మార్పీ కంటే బీరు సీసాపై రూ 30, మద్యం బాటిళ్లపై రూ.20 నుంచి రూ.40 వరకు అధికంగా విక్రయాలు జరుపుతున్నారని అడిగితే వైన్‌షాపుల వారే తమకు రూ.10 ఎక్కువగా విక్రయిస్తున్నారని చెబుతున్నట్లు మందుబాబులు అంటున్నారు.

అధికారుల ప్రేక్షకపాత్ర

ఎక్సైజ్‌ శాఖ నిబంధనల ప్రకారం లైసెన్స్‌ పొందిన దుకాణాల్లోనే మద్యం విక్రయించాల్సి ఉంటుంది. గ్రామాల్లో బెల్టుషాపుల్లో మద్యం విక్రయాలు జరపడం చట్టరీత్యా నేరం. గ్రామాల్లో బెల్టుషాపుల్లో మద్యం వేళాపాళా లేకుండా అందుబాటులో ఉండడంతో యువత మద్యానికి బానిసై మృత్యువాత పడిపోతున్నారన్నారు. దీంతో వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా బెల్టుషాపులు ఎత్తేస్తే తమ గ్రామాలు ప్రశాంతంగా ఉంటాయని మహిళలు చెబుతున్నారు.

పలుచోట్ల డ్రంకెన్‌ డ్రైవ్‌ తనిఖీలు



దుగ్గొండి: డ్రంకెన్‌ డ్రైవ్‌ పరీక్షలు నిర్వహిస్తున్న ఎస్సై పరమేష్‌



గీసుకొండ: డ్రంకెన్‌డ్రైవ్‌ పరీక్షలు నిర్వహిస్తున్న సీఐ రామకృష్ణ

దుగ్గొండి: నూతన సంవత్సరం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు మండల కేంద్రంలో, గిర్నిబావిలో పోలీసులు ఆదివారం రాత్రి డ్రంకెన్‌డ్రైవ్‌ కార్యక్రమం నిర్వహించారు. ద్విచక్రవాహనదారులు, కార్లు, జీపులను ఆపివేసి డ్రంకెన్‌ డ్రైవ్‌ పరీక్ష నిర్వహించారు. మద్యం తాగి వాహనం నడిపిన 10 మందిని గుర్తించి కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గీసుకొండ: గ్రేటర్‌ వరంగల్‌ పరిధి ధర్మారం సమీపంలోని కమర్షియల్‌ హోల్‌ సేల్‌ కాంప్లెక్స్‌ వద్ద గీసుకొండ పోలీసులు ఆదివారి రాత్రి సందర్భంగా వరంగల్‌–నర్సంపేట రహదారిపై డ్రంకెన్‌డ్రైవ్‌ పరీక్షలు నిర్వహించారు.ఈ పరీక్షల్లో ఇద్దరిపై కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా సీఐ రామకృష్ణ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడుపవద్దని సూచించారు. తనిఖీల్లో ఎస్సై వెంకన్న , సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడుపొద్దు

చెన్నారావుపేట: మద్యం సేవించి వాహనాలు నడుపొద్దని చెన్నారావుపేట ఎస్సై పస్తం శ్రీనివాస్‌ అన్నారు. 31 డిసెంబర్‌ 2023, న్యూ ఇయర్‌ వేడుకలను పురస్కరించుకొని మద్యం సేవించి వాహనాలు నడుపకుండా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా డ్రంకెన్‌ డ్రైవ్‌ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి జరిమాన విధించారు. హెల్మెట్‌ లేకుండా వాహనాలు నడిపి ప్రాణాలు మీదికి తెచ్చుకోవద్దన్నారు. తనిఖీలో ఏఎస్సై లక్ష్మణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన కలిగి ఉండాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

వర్ధన్నపేట: కేంద్ర ప్రభుత్వం గ్రామీణ రైతు, మహిళా సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందని వీటిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డీఆర్‌డీఏ సీసీ గోలి కొమురయ్య అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగేందుకు వికాస్‌ భారత్‌ సంకల్పయాత్ర ద్వారా ప్రజలను చైతన్యం చేసే కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన, ఏపీజీవీబీ బ్యాంకు అధికారి ఆదివారం మండలంలోని నల్లబెల్లి, చంద్రుతండాల్లో ఆయా గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంభందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఆర్‌ఎల్‌ఎం ద్వారా కల్పించిన రాయితీని పొందవచ్చన్నారు. పీఎం ఎస్‌ఎంఈ, పీఎం ఈజీపీ పథకాల ద్వారా ఉత్పత్తుల తయారీ, సర్వీస్‌ రంగాల్లో రుణాలు పొందిన వారికి 35 శాతం రైతులకు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో అన్ని పార్టీల ప్రతినిధులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిన్న.. గుడ్డు..!



చెన్నారావుపేట: కోడి గుడ్డు పక్కన పిట్ట గుడ్డు ఏమిటని అనుకుంటున్నారా.. కోడిగుడే.. మండలంలోని అక్కల్‌చెడలోని సంకెళ్ల శ్రీకాంత్‌ ఇంటిలోని కోడి పెట్ట ఆదివారం పిట్ట గుడ్డు సైజులో పెట్టింది. కోడి గుడ్డా, పిట్ట గుడ్డా అని స్థానికులు ఆసక్తిగా తిలకించారు. సాధారణంగా గుడ్డు సైజు 50–65 గ్రాముల సైజులో ఉంటుంది. పోషకాహారంలో సమతుల్యత లోపించడంతో గుడ్డు సైజు తగ్గుతుందని పశువైద్యాధికారి డాక్టర్‌ మంజిలాల్‌ తెలిపారు.

బోరు పనులు ప్రారంభం

పర్వతగిరి: మండలంలోని ఏనుగల్లు గ్రామంలోని ఖబ్రస్తాన్‌ వద్ద ఎంపీటీసీ నిధులతో మంజూరైన బోరు పనులను సర్పంచ్‌ దమ్మిశెట్టి సంధ్యారాణినర్సింహ, ఎంపీటీసీ కోల మల్లయ్యలు ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో యూసుఫ్‌ అజిత్‌ పాషా, రఫీ, అక్బర్‌, మోహిన్‌, మసీద్‌ గురువు మహ్మద్‌ ఇమ్రాన్‌, తదితరులు పాల్గొన్నారు.

జాతి ఐక్యత అభివృద్ధికి ‘మెపా’ కృషి

మెపా రాష్ట్ర ప్రధానకార్యదర్శి పులి దేవేందర్‌



సమావేశంలో మాట్లాడుతున్న పులి దేవేందర్‌

నర్సంపేట: జాతి ఐక్యత అభివృద్ధి కోసం మెపా ఎల్లవేళలా రాజకీయాలకతీతంగా పని చేస్తుందని మెపా రాష్ట్ర ప్రధానకార్యదర్శి పులి దేవేందర్‌ అన్నారు. పట్టణంలోని మెపా కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ అధ్యక్షతన సమావేశం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ నర్సంపేటలో అందరినీ కలుపుకుని ముదిరాజ్‌ల ఉన్నతి కోసం పని చేస్తుందని, ఆ దిశగా ముందుకు వెళ్లాలన్నారు.

మెపా నియోజకవర్గ కన్వీనర్‌గా యాదగిరి



మెపా నర్సంపేట నియోజకవర్గ కన్వీనర్‌గా పెండ్యాల యాదగిరిని నియమించినట్లు రాష్ట్ర ప్రధానకార్యదర్శి పులి దేవేందర్‌ తెలిపారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన డివిజన్‌ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు దొంతరబోయిన నగేష్‌, సలహాదారులు పిట్టల కుమార్‌, డివిజన్‌ బాధ్యులు దోని చేరాలు, మెపా రాష్ట నాయకులు నీరటి రాజు, సింగారపు రామకృష్ణ, దండు చిరంజీవి, కొక్కు నర్సింహస్వామి, చెన్నారావుపేట మండల బాధ్యులు, మహబూబాబాద్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి దుండి అశోక్‌, రమేష్‌, చొప్పరి శోభన్‌, పెండ్యాల ప్రభాకర్‌, కాట గణేష్‌, కొక్కు రామకృష్ణ,, నెక్కొండ, దుగ్గొండి, నల్లబెల్లి, ఖానాపురం మండలాల బాధ్యులు గుంటుక రమేష్‌, చిప్పరి శోభన్‌, రమేష్‌, శివ, తదితరులు పాల్గొన్నారు.

అ‘పూర్వ’ సమ్మేళనాలు



నాచినపల్లి జెడ్పీ హైస్కూల్‌ విద్యార్థులు



ఒకే వేదికపై దుగ్గొండి జెడ్పీ హైస్కూల్‌ విద్యార్థులు

దుగ్గొండి: మండలంలోని నాచినపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1983–84 పదో తరగతి పూర్తి చేసిన వారంతి పాఠశాల ఆవరణలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 40 ఏళ్ల నాటి ముచ్చట్లను నెమరువేసుకున్నారు. కష్ట సుఖాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాతి మోహన్‌, పెండెం హరిశంకర్‌, గుడిపెల్లి జనార్దన్‌రెడ్డి, రాజేశ్వర్‌రావు, ఇంద్రసేనారెడ్డి, ఫారెస్ట్‌ రెంజీ ఆఫీసర్‌ జగ్గునాయక్‌, బండి రాజమల్లు, కుమారస్వామి పాల్గొన్నారు.అలాగే దుగ్గొండిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1995–96 బ్యాచ్‌ టెన్త్‌ పూర్తి చేసిన విద్యార్థులు పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. అందరూ కలిసి చిన్ననాటి తరగతి గదులను పరిశీలించి నాటి గుర్తులను స్మరించుకున్నారు. అందరూ కలిసి కష్ట సుఖాల్లో సాయం అందించుకోవడానికి పరపతి సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. కార్యక్రమంలో శ్యాంసుందర్‌, కుసుమ జగదీష్‌, ముజీబ్‌, రాజు, రమేష్‌, మంజుల, శోభ, రజిత, కవిత, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పలువురి పరామర్శ



నర్సంపేట రూరల్‌: వీరన్నగౌడ్‌ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



పర్వతగిరి: అంత్యక్రియల్లో పాల్గొన్న కడియం ఎమ్మెల్యే శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్‌

నర్సంపేట రూరల్‌ : పట్టణంలోని సర్వాపురంలో ఇటీవల సీపీఐ(ఎంఎల్‌) జిల్లా నాయకుడు బూర్గు వీరన్నగౌడ్‌ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. వీరన్నగౌడ్‌ చిత్రపటానికి గౌడ జనహక్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ అనంతుల రమేష్‌గౌడ్‌ హాజరై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వీరస్వామి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు గోపగాని వెంకన్న, జిల్లా నాయకులు శీలం వీరన్నగౌడ్‌, బొడిగె మల్లేషం, నాంపెల్లి వెంకట్‌, వీలాసాగర్‌, గాదెగోని కుమారస్వామిగౌడ్‌, మేర్గు రమేష్‌, గంధసిరి సాంబరాజు తదితరులు ఉన్నారు.

చెన్నారావుపేట: మండలంలోని కోనాపురం గ్రామానికి చెందిన దొంతి రవికుమార్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదివారం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్‌, కల్లెపు రాజశేఖర్‌గౌడ్‌, ఎడ్ల నారాయణరెడ్డి, ఆవుల రాములు, వెల్దె రఘు, లింగమూర్తి, దొంతి మధు, నాయకులు పాల్గొన్నారు.

పర్వతగిరి: మండల కేంద్రానికి చెందిన చింతపట్ల పాపారావు శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. స్టేషన్‌ ఘన్‌పూర్‌ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్‌లు మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొన్నారు. వారి వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

దహన సంస్కారాలకు ఆర్థికసాయం

గీసుకొండ: మండలంలోని మరియపురంలో బిట్ల స్వర్ణ (35) అనే వివాహిత అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందింది. ఆమె భర్తతో పాటు కుటుంబ సభ్యులను సర్పంచ్‌ అల్లం బాలిరెడ్డి పరామర్శించి దహన సంస్కారాల కోసం రూ. 5 వేల సాయం అందించారు.

మనుగొండలో...

మండలంలోని మనుగొండలో సిద్దోజు వీరాచారి అనారోగ్యంతో మృతి చెందగా అతడి కుటుంబానికి ఆదివారం కాంగ్రెస్‌ మండల నాయకులు కొమ్ము శ్రీకాంత్‌ రూ. 5 వేల సహాయం అందించారు. పరామర్శించిన వారిలో నాయకులు కందికొండ రాజు, మర్రి చేరాలు,సాంబయ్య, కొమురయ్య, క్రాంతి తదితరులు ఉన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దారపు రమేష్‌

నర్సంపేట : ఓట్లు, సీట్లు, అధికారం ప్రజా సమస్యల పరిష్కారం కోసమేనని ఈ క్రమంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను బేషరతుగా నెరవేర్చి ప్రజలను ఆదుకోవాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్‌ డిమాండ్‌ చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం డివిజన్‌ కమిటీ సమావేశం అల్లీ సాబ్‌ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రమేష్‌ మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన తెలంగాణ ప్రభుత్వం ప్రజాసంక్షేమం కోసం కృషి చేయాలని అన్నారు. ప్రజాపాలన పేరుతో జాప్యం చేయకుండా కుంటి సాకులతో సంక్షేమ పథకాలను అమలు చేయకుండా అర్హులందరికి పథకాలు వర్తింప చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్‌రెడ్డి, డివిజన్‌ కార్యదర్శి మహ్మద్‌ రాజాసాహెబ్‌, రాష్ట్ర కమిటీ సభ్యులు కుసుంబ బాబురావు, నాగెల్లి కొమురయ్య, డివిజన్‌ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మర్రిచెట్టుకు నిప్పు పెట్టిన గుర్తుతెలియని వ్యక్తి

- విద్యుత్‌ సరఫరాకు అంతరాయం..



మంటల్లో కాలిపోతున్న మర్రిచెట్టు

నెక్కొండ: ఓ మర్రి చెట్టుకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటల్లో కాలిపోయిన సంఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. నర్సంపేట రోడ్డులోని వ్యవసాయ మార్కెట్‌ సమీపంలో ఉన్న పెద్ద మర్రి చెట్టును రోడ్డు వెడల్పులో భాగంగా పెద్దపెద్ద కొమ్మలు తొలగించారు. ఈ నేపథ్యంలో చెట్టు మోడు మాత్రమే ఉండడంతో శనివారం రాత్రి గుర్తు తెలియని వారు నిప్పు అంటించారు. ఉదయం మంటలు వ్యాపించి చెట్టు కాలిపోతున్న విషయాన్ని స్థానికులు గుర్తించారు. దీంతో అప్రమత్తమైన అధికారులు విద్యుత్‌ సరఫరాను నిలిపివేశారు. అలాగే టీవీ కేబుల్‌ వైర్లు సైతం కాలిపోయాయి. అనంతరం మంటలు చల్లార్చి, విద్యుత్‌ సరఫరాను పునరుద్ధరించారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవడంతో పెనుప్రమాదం తప్పిందని వారు తెలిపారు. దుండగులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఫిబ్రవరి 11న జాతీయ స్థాయి కరాటే పోటీలు



కరాటే పోటీల లోగోను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

నర్సంపేట: పట్టణంలోని పద్మశాలి గార్డెన్‌లో 2024 ఫిబ్రవరి 11న షోటోకాన్‌ జపాన్‌ కరాటే సంస్థ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి కరాటే పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు కరాటే పోటీలకు సంబంధించిన లోగోను ఆదివారం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ టోర్నమెంట్‌కు 13 రాష్ట్రాలకు చెందిన 1200 మంది క్రీడాకారులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో శ్యామల గణేష్‌, షోటోకాన్‌ కరాటే సంస్థ తెలంగాణ అధ్యక్షుడు పాలాయి శ్రీనివాస్‌, ఇండియా చీఫ్‌ ఇన్‌స్ట్రక్టర్‌ జోషి రచ్చ శీనుబాబు, తెలంగాణ స్టేట్‌ టెక్నికల్‌ డైరెక్టర్‌ భవానిచంద్‌, వరంగల్‌ జిల్లా ఇన్‌చార్జ్‌, నిరంజన్‌, సంస్థ ట్రెజరర్‌ అశోక్‌, సీనియర్‌ ఇన్‌స్పెక్టర్లు పి.విజయకుమార్‌, ఎం.శివసాయికుమార్‌, సీహెచ్‌.అఖిల్‌ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దొంతిని కలిసిన నాయకులు



ఎమ్మెలేను గజమాలతో సన్మానిస్తున్న లక్కమారి కాపు సంఘం నాయకులు

నల్లబెల్లి: మండలంలోని కొండాయిల్‌పల్లికి చెందిన పలువురు లక్కమారికాపు సంఘం నాయకులు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి గజమాలతో ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు పలు సమస్యలను విన్నవించారు. కలిసిన వారిలో కార్యక్రమంలో నాయకులు గాదె రాజిరెడ్డి, గోనె మల్లారెడ్డి, గాదె మల్లారెడ్డి, రవీందర్‌ రెడ్డి, సంపత్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, నాగరాజు రెడ్డి, శ్రీకాంత్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతి అందిస్తున్న సీఐ రామకృష్ణ

గీసుకొండ : గ్రేటర్‌ వరంగల్‌లోని 15వ డివిజన్‌ మొగిలిచర్ల శివారులోని ఎంసీజీ గ్రౌండ్స్‌లో నిర్వహించిన క్రికెట్‌ టోర్నీ విజేతలకు ఆదివారం సాయంత్రం స్థానిక సీఐ రామకృష్ణ బహుమతులను అందించారు. ఫైనల్‌ మ్యాచ్‌లో గెలిచిన కల్ట్‌ 11 టీంకు రూ.40 వేల నగదు, రన్నరప్‌గా నిలిచిన ఎం3 సొల్యూషన్‌ జట్టుకు రూ. 20 వేల నగదు బహుమతి అందించారు. మ్యాన్‌ ఆఫ్‌ ది సిరీస్‌గా జహీరుద్దీన్‌ ఖలీద్‌, బెస్ట్‌ బ్యాట్స్‌మెన్‌గా ఎండీ సమీర్‌ నిలువగా నిర్వాహకులు అఖిల్‌, నాగరాజు, అనిల్‌ పాల్గొన్నారు.